కాలనీల మధ్యే మురుగు నీరు

- ఐదేళ్ల నుంచి సమస్య
- దుర్వాసనతో ప్రజల ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఔట్‌లెట్ లేకుండా భూగర్భ డ్రైనేజీ నిర్మాణం

హయత్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాలనీల మధ్య మురుగునీరు చేరుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. చుట్టపు చూపుగా వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. ప్రధాన సమస్యలు ఉన్నచోట కాకుండా బంధుప్రీతి, రాజకీయ పలుకుబడి ఉన్న నేతల కాలనీలలోనే పనులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు ఐదేళ్లుగా ఐదు కాలనీల మురుగునీరు ఒకచోట చేరుతోంది. మురుగు నీటితో ఖాళీ ప్లాట్లు చెరువును తలపిస్తున్నాయి. మురుగు నీరు చేరడంతో తుంగ ఏపుగా పెరిగింది. సమీప కాలనీలకు మురుగునీటిలో నుంచే నడుచుకొని వెళ్లాల్సిన పరిస్థితి హయత్‌నగర్ డివిజన్‌లో నెలకొంది.


ప్రగతినగర్ కాలనీలో పేరుకుపోయిన మురుగు నీరు


ఇళ్ల పక్కనే మురికి కుంట

ఔట్‌లెట్ లేక పోవడంతోనే..

వర్డ్ అండ్ డీడ్ స్కూల్ పక్కనే ఉన్న కమర్షియల్ ట్యాక్స్, బ్లడ్ బ్యాంక్, గ్రీన్‌వుడ్, వాసవీ కాలనీల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. ఔట్‌లెట్ లేకపోవడంతో అధికారులు సీటీవో కాలనీ, ప్రగతినగర్ కాలనీల మధ్య విడిచిపెట్టారు. దీంతో పై కాలనీల నుంచి వచ్చే మురుగునీరు రోజూ కాలువలా పారుతూ ప్రగతినగర్ కాలనీకి చేరుకుంటుంది.

ప్రగతినగర్ కాలనీలో ఖాళీ ప్రదేశంలో మురుగునీరు చేరి చెరువును తలపిస్తోంది. తుంగ ఏపుగా పెరగడంతో అందులో పందులు, గేదెలు తిరుగుతున్నాయి. మురుగునీటి నిల్వతో దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. పై కాలనీలలో విపరీతంగా అపార్టుమెంట్లు రావడంతో మురుగు నీటి ప్రవాహం ఎక్కువ అయింది. ప్రగతినగర్ కాలనీ దాటి కన్యకాపరమేశ్వరి కాలనీ వరకు మురుగు నీరు వెళ్లింది. ఔట్ లెట్ లేకుండానే అధికారులు పై కాలనీల మురుగునీటిని తీసుకువచ్చి ఇళ్ల మధ్యలో విడిచిపెట్టడంపై పలు కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దుర్వాసనతో భోజనం చేయలేకపోతున్నాం



ప్రగతినగర్ కాలనీ మురుగునీటితో నిండిపోయింది. ఎవరికి చెప్పినా ఫలితం లేదు. దుర్వాసనతో భోజనం చేయలేకపోతున్నాం. దోమలు వృద్ధి చెందడంతో కాలనీల వాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఐదేళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలో మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి.

\- పద్మావతి,
ప్రగతినగర్ కాలనీ వాసి

పైపులైన్ మంజూరైంది

పై కాలనీల నుంచి వచ్చి ప్రగతినగర్ కాలనీలో నిలిచిన మురుగనీటిని కిందకు తరలించేందుకు డ్రైనేజీ పైపులైన్ మంజూరైంది. టెండర్ పూర్తయింది. వర్క్ ఆర్డర్ రాగానే పనులు ప్రారంభిస్తాం.

\- రాజు, ఏఈ, హయత్‌నగర్ డివిజన్ వాటర్ వర్క్స్

సమస్య పరిష్కరించకపోతే ధర్నా చేస్తాం



ప్రగతినగర్ కాలనీ, సీటీవో కాలనీ, కన్యకా పరమేశ్వరీ కాలనీతోపాటు పలు కాలనీలో మురుగు నీరు చేరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఔట్‌లెట్ లేకుండా డ్రైనేజీ నిర్మించి మురుగు నీరు కాలనీలపైకి వదులుతున్నారు. సమస్య పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తాం.

\-సామ తిరుమల్‌రెడ్డి,
హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కళాశాల యువ వైద్యులు

యువ డాక్టర్లు ఆదర్శంగా నిలవాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బిట్స్‌పిలానీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని వైద్య విద్య దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని ఆర్మీ డెంటల్ సైన్సెస్ కళాశాల 19వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ యువ డాక్టర్లు పేదలకు ఉచితంగా సేవలు అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎండీఎస్ విద్యార్థికి పాట్రన్స్ రోలింగ్ ట్రోఫీ, దక్షిణ్ భారత్ ఏరియాను పిరియాడోంటిక్స్ విభాగం నుంచి డాక్టర్ సురభి భదౌరియాకు ప్రదానం చేశారు. ఉత్తమ ఆల్‌రౌండ్ విద్యార్థిగా డాక్టర్ థెరిస్సా గ్రెగొరీ.. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీని గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువ దంతవైద్యులకు అవార్డులు, డిగ్రీలను గవర్నర్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, జనరల్ ఆఫీసర్ కమాండింగ్, తెలంగాణ ఆంధ్రా సబ్ ఏరియా(టాసా) చైర్మన్ డాక్టర్ మమతా కౌశిక్, ఆర్మీదంత వైద్య కళాశాలల ఆధ్యాపకులు, ఆర్మీ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దార్శనికుడు రాజీవ్ గాంధీ


విగ్రహావిష్కరణలో మంత్రి శ్రీధర్‌బాబు, వీహెచ్ తదితరులు

ఉప్పల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ ఆవశ్యకతను దశాబ్దాల క్రితమే గుర్తించిన దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ భారతదేశ దార్శనికుడని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఉప్పల్ స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ త్వరలోనే అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో నిర్మించబోయే మరో అత్యాధునిక స్టేడియానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఉప్పల్ స్టేడియానికి రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం మనందరికీ గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఏఐసీసీ కో-ఆర్డినేటర్ అంబర్‌పేట్ శ్రీనివాస్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

- ప్రొటోకాల్ వివాదం... స్పీకర్‌కు ఫిర్యాదు

తన నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న కార్యక్రమానికి తనను ఆహ్వానించకపోవడాన్ని నిరసిస్తూ స్థానిక ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీఏ రూపొందించిన ఆహ్వాన పత్రికలో తన పేరు లేకపోవడాన్ని ఆయన ఆక్షేపించారు. కాగా, నిర్వాహకులు హడావిడిగా శిలా ఫలకంపై ఎమ్మెల్యే పేరును చేర్చి ఆవిష్కరణకు సిద్ధం చేయడంతో గొడవ సద్దుమణిగింది.

అంతరంగాలు.. అనంతరంగాలు పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవయిత్రి, జేడీ ఫౌండేషన్ కన్వీనర్ పింగిలి కవితారెడ్డి రచించిన 'అంతరంగాలు.. అనంతరంగాలు' పుస్తకాన్ని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, జేడీ ఫౌండేషన్ చైర్మన్ వీవీ లక్ష్మీనారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని జేడీ ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన అనుభవాలు భావి తరాలకు అందించేందుకు పుస్తక రచన దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు మార్కులతో కూడిన విద్య కంటే విలువలతో కూడిన విద్యను నేర్పించాలని, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సామాజిక విశ్లేషకురాలు అనంతలక్ష్మి, ఎంఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, జేడీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీషిన్ రాకేష్‌కు జాతీయ అర్థమెటిక్ చాంపియన్‌షిప్




హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర విద్యార్థి గ్రీషిన్ రాకేష్ అరుదైన ఘనత సాధించాడు. జాతీయస్థాయిలో నిర్వహించిన అర్థమెటిక్ చాంపియన్‌షిప్‌ను ఆయన సాధించారు. ప్రపంచంలో వేగవంతమైన మానవ కాలిక్యులేటర్‌గా ఘనత వహించిన నీలకంఠ భాను ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ అర్థమెటిక్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించారు. ఇందులో దేశంలోని 750 నగరాల నుంచి 6వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఫైనల్ రౌండులో ఇచ్చిన సమయంలోగా 150కి పైగా ప్రశ్నలకు సమాధానాలిచ్చిన రాకేష్ చాంపియన్‌గా నిలిచాడు. 2020 మెంటల్ కాలిక్యులేషన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ నీలకంఠ భాను మాట్లాడుతూ.. ఈ చాంపియన్‌షిప్ సాయంతో మేం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలిగామని అన్నారు.

త్వరలో నిమ్స్‌లో 'నాట్' పరీక్ష

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ బ్లడ్‌బ్యాంక్ సెంటర్‌లో నాట్ (న్యూక్లియిక్ యాసిడ్స్ అంప్లిఫికేషన్ టెక్నాలజీ) ఆధునిక పరీక్ష విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి తెలిపారు. బ్లడ్‌బ్యాంక్ సెంటర్ ఆధ్వర్యంలో 'నాట్ ద్వారా మెరుగైన స్క్రీనింగ్, సురక్షిత రక్తాన్ని అందించడం' అంశంపై శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్లడ్‌సెంటర్ విభాగం అధిపతి డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ దాతల నుంచి సేకరించిన రక్తాన్ని నాట్ విధానంలో పరీక్షించి 10నుంచి 15 రోజుల్లోనే ఫలితాలను రాబట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్, ప్రొఫెసర్ శాంతి, వైద్యులు, బ్లడ్‌బ్యాంక్ సెంటర్, నర్సింగ్ సిబ్బంది, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలిచ్చి జీవితాల్లో వెలుగులు నింపండి

- తొలగించిన ఆర్టీసీ కార్మికుల విన్నపం


ఆర్టీసీలో తొలగించిన ఉద్యోగులు, కార్మికులు

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేసిన చిన్నచిన్న పొరపాట్లు, తప్పులకు ఉద్యోగాల నుంచి తొలగించారని, మన్నించి తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకుని మా జీవితాల్లో వెలుగులు నింపాలని టీజీఎస్ఆర్టీసీలో తొలగించబడిన ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చిన్న తప్పుల కారణంగా సుమారు 491 మందిని ఆర్టీసీ నుంచి తొలగించారని, తమ విజ్ఞప్తి మేరకు త్రిసభ్య కమిటీని ప్రభుత్వం నియమించిందని తెలిపారు. అన్ని వివరాలు పరిశీలించి 135మందిని విధుల్లోకి తీసుకున్నారని, మిగతా వారిని కూడా ఉద్యోగాల్లోకి తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన సంజయ్, డి.రాంబాబు, రాంచందర్‌యాదవ్, ఆంజనేయులు, శ్రీనివాసరావు, వాసుతోపాటు తొలగించబడిన ఆర్టీసీ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

పలు కేంద్రాల్లో 86 మంది గైర్హాజరు


సరూర్‌నగర్ జడ్‌పీహెచ్‌ఎస్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

హయత్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ మండల విద్యాశాఖ పరిధిలోని 20 కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. విద్యార్థులను 9 గంటలకే కేంద్రాల్లోకి అనుమతించారు. హయత్‌నగర్ మండలంలో 20 సెంటర్‌లలో 4,688 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. హయత్‌నగర్ పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో తొమ్మిది సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరీక్షకు 1,932 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఎల్‌బీనగర్: సరూర్‌నగర్ మండలంలో 45 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 9,088 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు.

సరూర్‌నగర్: బాలాపూర్ మండలంలో 20 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటిరోజు పరీక్షకు 4.036 మంది విద్యార్థులు హాజరు కాగా, 16 మంది గైర్హాజరయ్యారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను కూడా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు.

సైదాబాద్: సైదాబాద్ జోన్ పరిధిలో 23 పరీక్షా కేంద్రాలలో 5,023 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారని సైదాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి తిరునగరి రాధాకృష్ణ తెలిపారు. మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో అంధ బాలికలు సహాయకుల సాయంతో పరీక్షలు రాశారని చెప్పారు.

చాదర్‌ఘాట్: చార్మినార్ జోన్ పరిధిలో 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3,500 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 27 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలోని పరీక్షా కేంద్రాలను డీఈఓ సుశీందర్‌రావు తనిఖీ చేశారు.

వనస్థలిపురం: వనస్థలిపురం పరిధిలో 15 సెంటర్లు ఏర్పాటు చేశారు. మొదటిరోజు పరీక్షకు 3,112 మంది హాజరుకాగా, నలుగురు గైర్హాజరయ్యారు.

కోర్టు ఆర్డర్స్ సాకుతో ప్రభుత్వ భూమి కబ్జా

రక్షించాలని తహసీల్దార్‌కు సీపీఎం ఫిర్యాదు


తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకుడు నరసింహ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆర్డర్స్ సాకుతో ప్రభుత్వ భూమిలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ ఆరోపించారు. శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 283లోని ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోర్టు ఆర్డర్స్ చూపిస్తు కబ్జా చేసి అందులో నిర్మాణాలు చేస్తున్నారని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని రక్షించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. నిర్మాణాలను కూల్చి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు గుండె శివకుమార్, వర్కాల ముత్యాలు, రామారావు, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో పెన్షనర్ల సంక్షేమం ప్రస్తావించకపోవడం బాధాకరం

చాదర్‌ఘాట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమం గురించి ప్రస్తావించకపోవడం బాధాకరమని పెన్షనర్ల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం మలక్‌పేట సలీంనగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ చోల ఓం ప్రకాష్‌యాదవ్, కోశాధికారి జి. ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 నుంచి రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ, కమ్యుటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్ బకాయిలను చెల్లించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

యువకుడి వైద్యచికిత్సకు ఎల్‌వోసీ అందజేత

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చైతన్యపురి డివిజన్ గణేష్‌పురి కాలనీకి చెందిన గౌరవ్‌గౌడ్ అనే యువకుడికి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. ఎల్‌ఓసీని అతడి తల్లి సంధ్యకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు..

ఎల్‌బీనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఆలుకొండ అంజలికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరైంది. చెక్కును యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి బాధితురాలి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడికి సన్మానం

సరూర్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన తర్రె మల్లేశ్‌యాదవ్‌ను మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ శుక్రవారం సన్మానించారు. బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రంగారెడ్డి జిల్లా రూరల్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన నాయకులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.

ఇంటి వద్దకే సీతారాముల కల్యాణం తలంబ్రాలు

- భక్తుల కోసం ఆర్టీసీ ఏర్పాట్లు

హయత్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారాముల కల్యాణం తలంబ్రాలను భక్తులకు ఇంటి వద్దే అందజేయడానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఆయా డిపోలలో ఉన్న డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌కు రూ.151 చెల్లించి తలంబ్రాలను తీసుకోవచ్చని అధికారులు తెలిపారు. భక్తులు ముందుగానే బుక్ చేసుకోవాలన్నారు. తలంబ్రాలతో పాటు రెండు ముత్యాలు కూడా తీసుకోవచ్చన్నారు. హయత్‌నగర్-1, 2, బండ్లగూడ డిపోల పరిధిలోని భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు లాజిస్టిక్ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎ. మురళీధర్‌ను 7386187599 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలి

వనస్థలిపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. శుక్రవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌ను కలిసి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

'బీజేఆర్ భవన్‌కు మరమ్మతులు చేయండి'

మన్సూరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న కొత్తపేట సిగ్నల్ సమీపంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌కు మరమ్మతులు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. బీఎస్పీ ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు వేముగంటి సంపత్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం పేషీలో ఫిర్యాదు చేశారు. జగ్జీవన్‌రామ్ భవన్‌కు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

మహిళ అదృశ్యం


చైతన్య

సైదాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అదృశ్యమైంది. సింగరేణి కాలనీలో మేస్త్రీ బొక్క ఆంజనేయులు, భార్య చైతన్య(32), ముగ్గురు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. గత ఏడాది డిసెంబర్ 12న చైతన్య ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలో రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లి నెలరోజుల తర్వాత తిరిగి వచ్చింది. మూడు నెలలు అవుతున్నా భార్య ఆచూకీ లభించకపోవడంతో ఆంజనేయులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


డ్రోన్‌తో దోమల నివారణ మందు పిచికారీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు

మూసీ పరిసరాల్లో దోమల నివారణకు చర్యలు

- కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలో గల మూసీ పరీవాహక ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మోహన్‌నగర్ జనప్రియ క్వార్టర్స్, సమతాపురి కాలనీల్లో డ్రోన్‌తో దోమల మందు పిచికారీని ఆయన పరిశీలించారు. మూసీ వాకింగ్ ట్రాక్ పక్కన జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది రెండో విడత డ్రోన్ సాయంతో దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పూల మొక్కల కుండీల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు మూసీలో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపడుతున్నారని తెలిపారు. ఎంటమాలజీ ఏఈ రాంబాబు, నాయకులు తోట మహేందర్ యాదవ్, అశ్విన్‌సింగ్‌ఠాకూర్, కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.


సంజీవయ్యనగర్ బస్తీలో సర్వేలో పాల్గొన్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి

సంజీవయ్యనగర్ బస్తీలో సర్వే

చాదర్‌ఘాట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గంలోని మురికివాడల్లో జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 యూసీడీ విభాగం సర్వే చేపట్టింది. గురువారం నుంచి ప్రారంభమైన సర్వే ఈనెల 24న ముగియనుంది. శుక్రవారం కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డితో కలిసి సంజీవయ్యనగర్ బస్తీలో యూసీడీ విభాగానికి చెందిన రిసోర్స్ పర్సన్లు అండాలు, పద్మ, రేణుక ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. బస్తీలో నివసిస్తున్న వారి వివరాలు సేకరించారు.


నీటి ఎద్దడి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

కాలనీల్లో నీటి సమస్యను పరిష్కరించాలి

మన్సూరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో నీటి సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ డివిజన్ ప్రెస్‌కాలనీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తెలుసుకున్న ఆయన శుక్రవారం కాలనీలో పర్యటించారు. కాలనీలోని పవర్ బోరును రిపేర్ చేయించాలని అధికారులకు సూచించారు. బీజేపీ నాయకుడు పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బుడగ జంగాల నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో బుడగ జంగాలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేశారని బుడగ జంగాల హక్కుల దండు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు అన్నారు. శుక్రవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం చౌరస్తాలో రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిజేబుల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమండ్ల గోవర్ధన్ మాట్లాడుతూ బుడగ జంగాలను ఎస్సీ 'ఏ' గ్రూపులో చేర్చడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. జంగాల హక్కుల దండు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తూర్పాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.